





**ఆగాగు!**

సంతకం చూడకు! చిరునామా చూడకు! మూర్తీ! నా దస్తూరీ చూసి గుర్తుపట్టడానికి ప్రయత్నించు. అసాధ్యమేం కాదు. ఇరవై ఏళ్ళక్రితం నా దస్తూరీ మీద నువ్వు ఒలకబోసిన కవిత్వాలు నాకు యింకా గుర్తున్నాయి.


"నీ అక్షరాల ముత్యాలు ఏరుకొని నాకు కోటీశ్వరుడినవాలనుంది. అందుకు ఒకటేమార్గం. నీతోపెళ్ళీ, నీకు దూరంగా ఉండటమూ నీ ఉత్తరాలు అందుకోటమూ" గుర్తొచ్చామగదా! మూర్తీ!

నాకు పదివేలు కావాలి. నా చిరునామా యిస్తున్నాను. మా ఆయన 11 గంటల తర్వాత యింటిదగ్గర ఉండరు.

పద్మ"

మూర్తి ఆ ఉత్తరం చదవటం పూర్తి చేసాడు. వెంటవెంటనే మరో రెండుసార్లు చదివాడు.

గాలి ఆడుతున్నట్లనిపించలేదు. వెళ్ళి ఏ.సీ. పెంచాడు. వచ్చి ఇంటర్‌కమ్‌లో



దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనారీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావపరిధిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఏతరం రచయిత రచించినదైనా గానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు. ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

పిమేని పిలిచి మళ్ళీ చెప్పేవరకూ డిస్టర్బ్ చెయ్యవద్దన్నాడు.

'పద్మ!

ఎలా మరిచిపోతాడు పద్మని!

యీ ఉత్తరం చదవకముందు ఎన్నేళ్ళయింది ఆమెను గుర్తుచేసుకొని?' - చుర్రుమని కాలుస్తున్నట్లు ప్రశ్న.

'ఎలా ఉంటుందిప్పుడు!

అప్పుడెలా ఉండేది?

అప్పుడు సన్నగా పొడవుగా ఉండేది. బారుజుట్టు. కోలముఖం. కళ్ళు... మరీ విశాలమయినవికాదేమో! కాదు. అప్పుడవి పెద్దవిగానే ఉండేవి. పెద్ద పెద్ద కళ్ళ పద్మ అన్న ఊహ ఉండేది.

ఇప్పుడా పద్మ, ఏ రోడ్డుమీదయినా ఎదురుపడితే తను గుర్తు పట్టగలడా?'

మూర్తి విసుగ్గా అసహనంగా పెదవి కొరుక్కున్నాడు. పై పొర ఊడి చుర్రుమంది.

'తనను ఆమె గుర్తుపట్టగలదా?

అప్పటి తన రూపానికి యిప్పటి రూపానికి పోలికలున్నాయా?'

మూర్తి తన గదికి ఆనుకున్న స్నానాల గదిలోకి నడిచాడు. తన ఒక్కడి ఉపయోగం కోసమే ఉన్న ఆ గది, అందులో సామగ్రీ సౌకర్యాలూ తన తాహతుకి చిహ్నం. ఇవన్నీ తన కష్టార్జితం. ఎమ్ టెక్ చేసాడు. కేబుల్స్ ఇండస్ట్రీలోకి దిగాడు. పదిహేను సంవత్సరాలలో యీ మాత్రం ఎదిగాడు.

'ఏం లాభం?

దేశంలో పరిశ్రమలు పెరుగుతున్నాయి. టెక్నాలజీలు పెరుగుతున్నాయి. ఫారిన్ కొలాబరేషన్స్ పెరుగుతున్నాయి. ఒక్కొక్కడు ఏమీ కాకుండానే తెల్లారేసరికి యిండస్ట్రీలను టేకోవర్ చేసుకుంటున్నాడు. రాజకీయ ప్రాబల్యం కూడా ఒక పెట్టుబడే! తనలాటి వాళ్లు యిలా కొట్టుకుచస్తున్నారు. ఉద్యోగం చేసేవాడు తనకన్న మెరుగు. యింటికి చేరుకుంటే చాలు-యింకే టెన్షన్సూ ఉండవు!'

అలవాటుగా మూర్తి మీదకు వాలింది వర్తమానం.

స్నానాలగదిలో అద్దంముందు నిలబడిన మూర్తికి తను ఎందుకు నిలబడ్డానా అన్న ప్రశ్నకలిగింది! ఆలోచనల్లో చేదు అతన్ని గిల్లింది.

తల విదుల్చుకుని అద్దంలో మూర్తిని పరిశీలించాడు.

ఇరవై ఏళ్ళక్రితం తను ఎలా ఉండేవాడో అతనికి గుర్తురావటంలేదు. నాలుగేళ్లక్రితం జరిగిన ప్రమాదంలో పెదవి చీరుకుపోయింది. మీసాలు తీసేసాడు. ఒత్తుగా ఉండే మీసాలు పెదాలను చిన్నవిగామా అందంగానూ కనిపింపజేసేవి. ఇప్పుడు పెదాలు పెద్దవిగా అనిపిస్తున్నాయి. తలమీద జుత్తు తగ్గిపోయింది.

తనను పద్మ గుర్తుపట్టగలదా?

గుర్తు పడుతుంది.

ఎలా?

ఆమెకు ప్రేమ ఉంది.

ఏమిటో అంత నమ్మకం?

ఆమె ఉత్తరం.

అందులో ఒక్క ప్రేమ వాక్యమయినా లేదే!

వాక్యాలలో ప్రేమ తెలుస్తుందా?

మరి....! యింకెందులో తెలుస్తుంది!?

-- కళ్ళజోడు తీసాడు మూర్తి. కళ్ళు ఉబ్బినట్టున్నాయి రాత్రి, నిద్రలేదు. ఒక పార్టీని ఎంగేజ్ చేయవలసి వచ్చింది. వాళ్ళకోసం తాగాల్సి వచ్చింది. నానా చెత్తా తాగాల్సి వచ్చింది. ఇలాంటి పనులకు ఎవడినయినా పి.ఆర్.వో గా పెట్టుకోవాలి. దొంగాముండా కొడుకులు. కస్టమర్స్ పేరున తామే తాగేస్తారు. హోటలు వాళ్ళతో చేరి దొంగ బిల్లులు.... కమీషన్లు....! ఛ ఛ! లోకం యిలా అయిపోయిందేం? నమ్మదగ్గ మనిషే కనిపించడు.

పద్మ కూడా నమ్మదగ్గది కాదా?

--మూర్తి చల్లటినీటితో మొహం తడుపుకున్నాడు. అయిష్టమయిన ఊహని తోము కుంటే పోతుందన్నట్లు సబ్బుతో తోమాడు.

బొచ్చుతువ్వాలుతో ముఖం ఒత్తుకున్నాడు. పౌడరు అద్దుకున్నాడు. కొంచెం ఫ్రెష్ అయాక తిరిగి వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు.

అయినా పద్మమీద కలిగిన ప్రశ్న అతన్ని బాధించటం మానలేదు.

"నేనెంత పాపాత్ముడిని!"

పైకే అన్నాడు. అది పెదాలమీదనించే వెలువడినట్లుంది.

ఏం - పద్మనిమాత్రం ఎందుకు నమ్మాలి?

పద్మ... పాతికేళ్లక్రితం పద్మ... తుఫాన్‌లాంటి పద్మ... ప్రశాంత సముద్రంలాంటి పద్మ... తనలో తను వేసుకోలేని ప్రశ్నలకు ఆకారంలాంటి పద్మ... తన ప్రతి అడుగునూ పట్టివేసే భయాలకు కత్తివేటులాంటి పద్మ... ఆ పద్మని జయించటమే... ఆమె కరుణించటమే.... ఆమె తన కన్నీరు తుడవటమే... అదే... అదే... జీవితంగా అయిదేళ్ళు బ్రతికాడు. ఆమె చెట్టులాగా... తాను తీగలాగా... ఆమె పర్వతంలాగా... తను ఆమె చుట్టూ నదిలాగా.... అయిదేళ్ళు....! నిజమే! అదంతా నిజమే! వాస్తవమే! తండ్రి తనకి పెళ్ళి కుదిర్చాడు. ఆ విషయం చెప్పి ఏడిస్తే నవ్వింది పద్మ. 'నాకు ముందే తెలుసు-- నువ్వు మీ నాన్న మాట వింటావు--' అంటూ శుభాకాంక్షలు చెప్పింది. తన పెళ్ళయిపోయింది. ఆస్తి ఆస్తిలో కలిసింది.

పెళ్ళయాక... రెండుసార్లు కలిసింది పద్మ.

తండ్రిపోయాడట. కుటుంబభారం నెత్తిన పడిందట. ఉద్యోగాన్వేషణలో ఉందట.

మరో ఏడాదిన్నర తర్వాత మళ్ళీ కాకినాడలో కనిపించింది. ఏవో కంపెనీ సామాన్లను కొనమని మెయిన్ రోడ్డు మీద జనాన్ని ఆపుతోంది. తను మొహం చాటేసాడు.

ఆ తొలి పద్మ, యీ మలిపద్మా చేదు జ్ఞాపకాలూ కొన్నాళ్ళు తనను వెన్నాడాయి.

అప్పట్లో తనకి తను నమ్మదగ్గవాడిగా కనిపించేవాడు కాదు. తనలాంటివాడు.... అలాంటి పద్మని... నమ్మదగ్గది కాదనుకోవటమా?!

ఎందుకు నమ్మాలి?

పద్మ... ఆనాటిపద్మ... ఆ దేవత...

ఎంత అమాయకుడివి మూర్తీ! అందుకే నువ్వు ఎదగవలసినంతగా ఎదగలేకపోతున్నావు! యిరవై ఏళ్ళక్రితం పద్మ మంచిదనిమాత్రం గారంటీ ఏమిటి? నీకా- ఆస్తీ పాస్తీ, అందం, చందం, చదువూ సంధ్యా... ఒకటేమిటి అన్నీ ఉన్నాయి. వాటిమీద ఎందరు బీదపద్మలు కళ్ళు పడవచ్చు?

చఛ! ఏమిటీ ఆలోచనలు!

--తల విదిలించుకున్నాడు మూర్తి. గాజు పేపర్ వెయిట్‌ని బలంగా నొక్కాడు. చేతినిండా మట్టిని ఉంచుకుని నొక్కితే వేళ్ళ సందులనించి అది బయటికి జారుతున్నట్లు జారుతున్నాయి ఆలోచనలు.

సరే! ఆనాటి ఆ బీదపద్మ... తన సాహస ప్రవర్తనతో... నిన్ను ఆకర్షించిన పద్మ... మంచిదనే అనుకుందాం! యిప్పుడు యీ పద్మ సంగతేంటీ?

ఏమయిందిప్పుడు?

పద్మ పదివేలే కావాలంది మూర్తీ!

'పదివేలే కదా! పదిలక్షలు అడిగినా యివ్వగలవన్నంత ధీమాగా అడిగింది. ఇంకా నీమీద ఎంత నమ్మకమూ... హక్కూ... లేకపోతే అడుగుతుంది?

నిన్ను నీ ఫ్యాక్టరీ పనివాళ్ళు కూడా అంతకన్న ధీమాగానూ... హక్కుగానూ అడుగుతున్నారు! ఏం... వాళ్ళకీ నీమీద ప్రేమ ఉందంటావా?'

మూర్తి స్క్రిబిలింగ్ పాడ్ అందుకున్నాడు. కలం తియ్యగానే దానికి అమర్చిన చిన్ని లైట్‌నించి కాంతి పాడ్‌మీదకి జారింది. నెమ్మదిగా కలంతో కాగితం మీద చెక్కసాగాడు. ప్రేమ! ప్రేమ!

ఆ రెండు తెలుగు అక్షరాలతో కొంత కాగితం నిండింది. దానిని చించేసాడు. కలం మూసేసాడు. కాంతి మాయమైంది. పాడ్ పక్కన పడేసాడు.

"మూర్తీ! నీకు పద్మని చూడలనుందా?

ఉంది.

ఎందుకు?

ఆమె ఏ కష్టాలలో ఉందో!

గప్పాలు కొట్టకు!

గప్పాలు కాదు. నిజమే! పరాయివాడిని అడుగుతుందా! నన్నయినా ఎంత యిరుకున ఉండబట్టి అడిగిందో!

లోకం చదివిన మూర్ఖుడా! పద్మ వంటి బీదవాళ్ళు డబ్బెందుకు అడగరు! ఎవరినయినా అడుగుతారు!

కాదు. డబ్బు ఒకనెపం. ఆ నెపంతో నన్ను చూడాలని!

ఎందుకో అంతచూడాలని?

ప్రేమ!

యిన్నాళ్ళూ ఏమయిందో ఆ... ప్రేమ?

యిప్పుడే నా అడ్రస్ తెలిసిందేమో!'

ఎవరో వెక్కిరించుతున్నట్లయింది!

మూర్తి తన యింటర్‌కమ్‌లో పియేని పిలిచాడు. గబగబా రెండు ఉత్తరాలు డిక్టేట్ చేసాడు.

ఒకటి గవర్నమెంటు ఆఫీసర్‌కి! తన కస్టమర్‌కి! తను యిచ్చిన కేబుల్ కొటేషన్ విషయంలో ఏదో టెక్నికల్ క్లారిఫికేషన్ అడుగుతున్నాడు. అంటే - నువ్వు నన్ను చూస్తే నేను నిన్ను చూస్తాను అంటున్నాడు. డిస్కషన్స్‌కి వస్తానని తేదీ ఖరారు చెయ్యమని జవాబిచ్చాడు! రెండవది ఒక ఫర్మ్‌కి! వాళ్లు తనకి కావల్సిన ఒక మెషినరీ తాలూక వివరాలు యిస్తూ నెగోషియేషన్స్‌కి ఎప్పుడు రమ్మంటారో తెలపమన్నారు! తెలిపాడు!

ఒకరినొకరు ఊరికే సరదాకి చూడరు! బేరసారాలు ఉంటాయి. యిచ్చి పుచ్చుకోటాలు ఉంటాయి. అందుకు మాత్రమే మనుషులు కలుస్తారు!

పి.యే. టైప్ చేసుకొస్తానని వెళ్ళిపోయింది.

'పద్మ చెడ్డదే- ఒప్పుకుంటాను - అయితే ఏం?'

కసిగా మొదలయాయి ఆలోచనలు.

'అలాంటి చెడ్డదానికి పదివేలిస్తావా?'

'ఊరికే ఎందుకిస్తాను?'

'ఏం పుచ్చుకుంటావ్?'

'వాళ్లాయన లేనపుడు రమ్మంది గదా!'

నీచుడా!

'- - - - - - - - - - '

'- - - - - - - - - - -'

## 2

చిరునామానూ, ఎదురుగా ఉన్న భవంతినీ మార్చి మార్చి చూసాడు మూర్తి. గేటు వద్ద గూర్ఖా, కుక్కలున్నాయి అన్న హెచ్చరిక బోర్డూ ఉన్నాయి. తనని తీసుకువచ్చిన టాక్సీని పంపేసాడు. గేటువేపు నడిచాడు. నడుస్తూనే యింటికి ఏదయినా అవుట్ హౌస్ ఉందేమోనని చూసాడు. అలాంటిదేం కనపడలేదు. విశాలమయిన ఆవరణలో ముందుభాగాన చక్కగా పెంచిన తోట, భవంతి, గేటుకి కాస్త దూరంగా ఉంది. రెండు ఏర్ కండిషనర్స్ కనిపిస్తున్నాయి.

'మేమ్‌సాబ్ అందర్ హై! జాయియే!' అన్నాడు గూర్ఖా.

ఆ మాటతో మూర్తి సందేహాలన్నీ తొలగిపోయాయి.

కొంత ఆశ్చర్యమూ, మరికొంత నీరసమూ కలిగాయి. ముందుగానున్న హాల్లోకి, తలుపు తీసిన పనిపిల్ల ఆహ్వానించి సోఫాలో కూర్చోబెట్టింది. అమ్మగారికి చెపుతానని పైకి వెళ్ళింది.

మూర్తికి యిబ్బందిగా, చికాకుగా ఉంది.

ఇరవై సంవత్సరాల తర్వాత పద్మని చూడబోతున్న థ్రిల్లు తనకు కలగటం లేదని మూర్తికి గుర్తుకు వచ్చేసరికి ఒక స్త్రీ రావటం కనిపించింది.

పద్మ!!

అప్రయత్నంగా మూర్తి మనసంతా కదిలిపోయింది. అన్ని ఆలోచనలూ స్తంభించాయి. నడచివస్తున్న ఆమెను చూస్తుంటే ఆనాడు తనకోసం వస్తున్న ఆనడక కలిగించిన స్పందన తాలూకు పాతఫోటోను చూస్తున్నట్లుంది.

లేచి నించున్నాడు.

"పద్మా!"

"కూర్చో మూర్తీ!"

వచ్చి సోఫాలో ఎదురుగా కూర్చుంది. పనిమనిషిని హుందాగా పిలిచింది.

పద్మలావయినా, లావణ్యం తగ్గినట్లు

'ఆహ్వానం' ప్రచురించే విలువైన క్రొత్తకథల విశ్లేషణలో పాఠకుల్నీ, రచయితల్నీ పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. తమ అభిప్రాయం సంక్షిప్తంగా, సమీక్షాత్మకంగా రాసి పంపితే ఎన్నిక చేసిన వాటిని ప్రచురించటమే గాక 50రూ. పారితోషికం కూడ పంపుతాం. --ఎడిటర్

అంతర్జాతీయ ఖ్యాతి నార్జించుకొన్న తెలుగు కథ ఈనాడు వ్యాపార విలువలకు బలైపోతున్నదని, మంచి కథలకు కొరత ఏర్పడుతున్నదని కథకులు, కథా వేదికల వారూ గొడవ పెట్టేస్తున్నారు. నిజమే కావచ్చు కానీ, కథకులు ఆర్థిక ప్రలోభాలకు, అర్థంలేని ప్రచారకాంక్షకు అమ్ముడుపోకుండా తమ నిజాయితీని నిలుపుకుంటూ సమాజం పట్ల ఆర్తితో, అవగాహనతో రాసే కథకుల కథలకు 'ఆహ్వానం' పలికే పత్రికలు లేకపోలేదనే విషయం ముందు గుర్తించి, ఇటువంటి పత్రికలకు తమ సహకారం అందించటం ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించమని కోరుతున్నాం.

—ఎడిటర్

లేదు. జుత్తు కొద్దిగా నెరసింది. ఖరీదయిన కళ్ళజోడు కళ్లలో ఆనాటి తీక్షణతను పూర్తిగా కప్పలేకపోతోంది.

ఆమెలోని భౌతికమయిన మార్పులను గమనిస్తున్నాడు మూర్తి. క్రమంగా ఆలోచనలు కదలసాగాయి. 'పద్మలో పెద్ద మార్పులేదు' అన్న ఆలోచన ఆమె వెనకటి వ్యక్తిత్వాన్ని కళ్ళముందు నింపసాగింది. ఆమె ముందు ఆనాడు తాను పర్వతం ముందు కొండవాగులా ఉంటే యీనాడు ఒక పిల్లకాలువలా కూడా లేనట్లు అనిపించసాగింది. ఆ యింటికి చేరకముందు తనలో కలిగిన ఊహలు ఎంతటి ఘోరమైనవో తను ఎంత నీచుడో మరింత బలంగా అనిపించసాగాయి.

పద్మ మాటలాడసాగింది.

ఆమె నిన్ననో మొన్ననో కలిసిన మనిషితో మాట్లాడుతున్నట్లు మాట్లాడుతోందనిపించసాగింది.

ఈ మధ్య నళిని రైల్లో కనిపించిందిట. ఆమె మూర్తి పినతల్లికూతురు. మూర్తి వివరాలు చెప్పిందట. అడ్రస్ తెలిసిన వైనం వివరించింది. ఆ నాటి స్నేహితుల గురించి వాళ్ళ జీవితాల గురించి చాలా సమాచారాలు చెప్పింది. అతని వ్యాపారం గురించి అడిగింది. కబుర్లు. కబుర్లు ప్రశ్నలన్నీ పద్మవి. జవాబులన్నీ మూర్తివి.

హఠాత్తుగా అంది పద్మ.

"ఏంటలా ఉన్నారూ-?"

"ఎలా?"

"అన్యమనస్కంగా-!"

మూర్తి అటూ యిటూ కదిలాడు.

"నువ్వేం మారలేదు--" అన్నాడు.

"నిజమే!"

"అవును. అప్పుడూ నువ్వే మాట్లాడేదానివి. యిప్పుడూ నువ్వే మాట్లాడుతున్నావు--"

"అప్పుడూ నేను వద్దనలేదు. యిప్పుడూ వద్దనటంలేదు. మాట్లాడూ--"

కావాలని నోరు మూసుకున్నట్లు కూర్చుంది. మూర్తి బలవంతంగా నవ్వాడు.

"నువ్వు యింత ధనవంతునికి..."

"భార్యనేనా అని అనుమానమా?"

ఆ గొంతులో ఉన్న భావమేమిటో మూర్తికి అందలేదు. అసలు ఏ భావమయినా ఉన్నదో లేదో కూడా అతనికి తెలియలేదు.

"నువ్వు అదృష్టవంతురాలివి--" అన్నాడు కొంతసేపయాక.

'పద్మలో పెద్దమార్పు లేదు' అన్న ఆలోచన ఆమె వెనకటి వ్యక్తిత్వాన్ని కళ్ళముందు నింపసాగింది. ఆమె ముందు ఆనాడు తాను పర్వతం ముందు కొండవాగులా ఉంటే యీనాడు ఒక పిల్ల కాలువలా కూడా లేనట్లు అనిపించసాగింది. ఆ యింటికి చేరకముందు తనలో కలిగిన ఊహలు ఎంతటి ఘోరమైనవో తను ఎంత నీచుడో మరింత బలంగా అనిపించసాగాయి.

"యింత ధనవంతునికి ధర్మపత్నినయినందువల్లా?" అదిప్రశ్నే. అయినా అది జవాబుకూడా. మూర్తికి అది ప్రశ్నలాగా అనిపించలేదు. అది తన ఏ ప్రశ్నకూ జవాబులాగా తోచలేదు.

"ఒకప్పుడు నాకు షాక్ చేయటం ఆనందమిచ్చేది.

నిన్ను షాక్ చేయటం మరీనూ! నిన్ను షాక్ చేయాలని యిప్పుడు మాత్రం లేదు. నీకు నవ్వొస్తుందేమోకూడా..."

అంటూ ఆగి-- "నిన్ను పోగొట్టుకున్నందుకు నేను దురదృష్టవంతురాలిననే అనిపిస్తోంది"

క్షణకాలం మూర్తి దిగ్భ్రాంతికి లోనయాడు. ఆమె అంతటి ఐశ్వర్యవంతురాయినా... తనను యింకా యింత ప్రేమిస్తోందా? అయితే ప్రేమ అన్నది ఉందా? - మూర్తి ఆధోరణిలో సాగే ఆలోచల ప్రభావంతో అన్నాడు.

"మీ వారు..." మంచివారు కాదా అని ప్రశ్నించాలని మూర్తి ప్రయత్నం. ఆ ప్రయత్నం పూర్తికాకుండానే పద్మ జవాబిచ్చింది.

"బిజినెస్ పనిమీద జపాన్ వెళ్ళారు--"

మూర్తికి అంతస్తులో కూడా తను ఎంతో దిగువగా ఉన్నట్లనిపించింది. దాంతో వ్యక్తిత్వంలో కూడా ఆమె తనకన్న ఎంతో ఎత్తున ఉన్నట్లనిపించసాగింది.

"ఇంత డబ్బున్నదానివి నీకు డబ్బు ఎందుకు అవసరమయింది పద్మా--?" అన్నాడు వెంటనే!

"తెచ్చావా?"

"తెచ్చాను--"

"నాకు తెలుసు మూర్తీ! నువ్వు తప్పకుండా తెస్తావు--" అంది పద్మ. ఆమె కళ్ళు మూసుకుంది.

మూర్తికి ఆమె ఏదో చెప్పబోతున్నదని అర్థమయింది.

"చెప్పు పద్మా!" అన్నాడు.

"మూర్తీ- నాకు బీదరికం తెలుసు. డబ్బు లేకపోవటం తెలుసు. డబ్బు అనేది పేదవాళ్ళను ఎంత అమానుషంగా తయారు చెయ్యగలదో తెలుసు. ఈ ఐశ్వర్యాల జీవితం లభించాక డబ్బు చేసే దారుణాల రెండోభాగాన్నీ తెలుసుకున్నాను. ఈ దారుణంలో ప్రత్యక్ష హింస ఉండదు. దీన్ని సంపాదించటమనే భయంకర వ్యసనానికి మించిన అడిక్షన్ లేదు. యిక్కడ మనుషుల మధ్య ఏ సహజ సంబంధమూ పెరిగే అవకాశం ఉండదు. ఒక్క మార్దవమయిన గుర్తింపు కోసం యిలాంటి కుటుంబాలలో ఎంత ఆశ! దానికోసం చిన్నమెత్తు ప్రయత్నం కూడా చెయ్యనీయని ఎంత బలహీనత. .. మూర్తీ! ఇది నా అనుభవం! లేదా ఇది నా సమస్య...! ఇది తప్పనీ కేవలం యిది నా ప్రత్యేకబాధనీ... అనుమానం! ఎలా తేల్చుకోవటం?

మూర్తీ- నా ఆలోచనలు తప్పని నువ్వు నిరూపించావు. థాంక్స్!" అంది.

మూర్తికి ఆమె మాటలన్నీ తన మనస్థితికి వ్యాఖ్యానంలా అనిపించాయి. ఆ మాటల వెనక ఆమె మనస్థితి ఏమిటా అన్న విషయం అతను యోచించలేదు.

"అయితే- నీకు నిజంగా డబ్బు అవసరం లేదన్న మాట-" అన్నాడు.

"ఎందుకులేదూ-- ఉంది" అంది నవ్వుతూ!

"బలేదానివే-- నీకు డబ్బెందుకూ?"

"ఎందుకో చెప్పితీరాలా?"

"అబ్బే అదికాదు- నువ్వు నన్నడగడమేంటా అని-"

"నిజమే- నళిని కనిపించకపోతే- నీ అడ్రస్ దొరకకపోతే- నేను నిన్ను అడిగే ప్రసక్తే ఉండేదికాదు-' '

"ఏం చేసేదానివి?"

"చిన్నా, పెద్దా అవసరాలు వచ్చినపుడో- సరదాలు వేసినపుడో... మా వారినే ఎప్పుడూ అడిగినట్టే.. . అడిగేదాన్ని! బ్రతిమాలో... అబద్ధం ఆడో... కోపగించో..." పద్మ గొంతులో జీర వినిపించింది. ఆమె తలవంచుకుంది.

పనిమనిషి తెచ్చిన జీడిపలుకులు నములుతూ టీ తాగుతున్నాడు మూర్తి.

"మూర్తీ! నీకలా ఉత్తరం రాసాను ఒక మూడ్‌లో! నువ్వు వచ్చావని పని మనిషి చెప్పేదాకా... నువ్వు వస్తావన్న హోప్ పెద్దగా లేదు. నీ మీదున్న నమ్మకమూ, అవగాహనా... జస్ట్ ఫూలిష్ అనిపించి నవ్వొచ్చేది. కానీ... యీ క్షణంలో నీకెంతో దగ్గరగా ఫీలవుతున్నాను. ఒక విషయం చెప్తాను- నాకు డబ్బు కొదవాలేదు- స్వేచ్ఛా లేదు. అసలు ఆడది అన్నప్రాణి డబ్బు విషయంలో భర్తతో చనువుగా ఉండగలదా? మగాడి దగ్గర ఉంపుడుగత్తెలకు ఉండే స్వేచ్ఛ పెళ్ళాలలో ఉంటుందంటావా?"

మూర్తి నవ్వాడు.

"లేదు మూర్తీ! నేను సీరియస్‌గానే అడుగుతున్నాను."

"నేను మగాడినికదా- నా అభిప్రాయానికేం విలువ ఉంటుంది?"

"అలా అనకు-- మీ ఆవిడకి నాలాంటి పరిస్థితి రాదు. నేను నీ దగ్గర చెయ్యి జాపినట్లుగా--"

ఛెళ్ళున మొహం మీద చరిచినట్లయింది.

వనజకి తను నగలు చేయించాడు. ఖరీదయిన చీరలు కొన్నాడు. విలాస యాత్రలకు తీసుకెళ్ళాడు. కాని... ఆమె లెక్క చెప్పకుండా ఖర్చు పెట్టటానికి తను ఎప్పుడయినా ఏమైనా యిచ్చాడా? ఏదయినా వస్తువు పారేసుకుంటే- ఎంత తెలివి తక్కువ మనిషో ఎన్నిసార్లు దెప్పిపొడవలేదూ! ఏముంది! యివన్నీ సామాన్యమే!

మూర్తి ఆలోచనలు వదిలించుకుంటు అన్నాడు-

"నీ పరీక్షలో నేను నెగ్గానన్నమాట--"

ముఖమంతా వెలిగిపోతూండగా అంది పద్మ-- "నేను నీకు పరీక్ష పెట్టానంటావా? ఏమో! అయితే అయుండవచ్చు. కవిత్వం కాదు మూర్తీ! మనిషికీ మనిషికీ మధ్య సందులేనంత దగ్గర తనం ఉండాలని వెర్రి ఆశనాకు! మగ, ఆడ అన్న భేదం నాకు ఓ అడ్డుగోడలాగా కనిపిస్తుంది-- ఓ వారధిలాగా కనిపిస్తుంది. ఆ మగా, ఆడా... భార్యా భర్తే కానక్కర్లేదు. అన్నా చెల్లీ; తండ్రీ కూతురూ; అన్నా, చెల్లెలూ; స్నేహితులూ; ప్రేమికులూ.... ఎవరయినా కావచ్చు. ప్రతీ వాళ్ళమధ్యా డబ్బు... ఎడమూ కల్పిస్తుంది... ఎనలేని దగ్గరతనమూ కల్పిస్తుంది. ఇన్నేళ్ళ తర్వాత ఓ పిచ్చి ఉత్తరానికి స్పందిస్తూ వెర్రిగా వచ్చావు. నా ఉత్తరానికీ, నీరాకకీ మూలం ప్రేమో... స్నేహమో- నేను తర్కించదలుచుకోలేదు. బహుశా నాది పిచ్చి... నీది వ్యక్తిత్వమూ! మూర్తీ! నా భర్తతో ఇన్నేళ్ళు కలిసి జీవించాను.... నా దరిద్ర స్థితిలో నన్నాయన చేరదీసి పెళ్ళాడారు... నేనెప్పుడూ ఆయనకి సమానురాలిననిపించదు. ఆయన దాత... యజమాని... నేను గ్రహీతను! సేవకురాలిని... ఆయన విటుడు... నేను వేశ్యను! మూర్తీ! యీ భావాలు పోవు. యీ భావాలెందుకు కలిగాయి అసలు? ఆయనా... నేనూ కలిగించుకొన్నామా? డబ్బు అనేది కలిగించిందా? ఏమో! తెలియదు. యీ భావాలలో... యీ వెలితిలో... ఎప్పుడైనా నువ్వు గుర్తువస్తే... నువ్వు నన్నెందుకు పెళ్ళిచేసుకోలేదన్న ఆలోచనలు! నామనసు ఏమని సర్దేసేదో తెలుసా! నువ్వు ధైర్యం లేక నన్ను పెళ్ళాడలేకపోయావుగానీ.... డబ్బు కోసంకాదు. యిప్పుడు నువ్వు అలా ఉండవు-- అనేది మనసు! మూర్తీ- ఈ రోజు నీరాక... యిరవై ఏళ్ళ క్రితం దగ్గరతనంతో... నాకోసం ఒక్క చిన్న ఉత్తరంతో రావటం.... యీ క్షణంలో నా మనసు ఏదో అమూల్యమయిన దానిని పొందుతున్న ఫీలింగ్! ఆ ఫీలింగ్ అనిర్వచనీయం...."

పర్వతానికి తగిలిన మబ్బు వర్షించినట్లుగా పద్మ మాటలు ఉరుకుతున్నాయి.

మూర్తి ఆమెనే పట్టిపట్టి చూస్తున్నాడు.

ఆమెకి డబ్బు అవసరం లేదన్న భావన అతని మనసుని తేలికపరిచింది. యిరవై ఏళ్ళక్రితం పద్మమాటలనీ, యీ పద్మ మాటలనీ పోల్చాలని ప్రయత్నిస్తున్నాడు. అతనికి అప్పటి మాటలే గుర్తురావటం లేదు. యీ మాటలు కూడా ఏదో అపరిచిత జీవుల భాషలా ఉంది. హృదయం, స్పందన... సందులేనితనం... యివన్నీ- యీ పదాలన్నీ దేనికి చిహ్నాలు? సంకేతాలు?

"మూర్తీ! మనమధ్య యిప్పుడున్న సంబంధం ఏంటి?" అంది పద్మ.

మూర్తి అనుకోని ఆ ప్రశ్నకు తడబడ్డాడు.

-యిరవైఏళ్ళ క్రితం ఆమె ప్రవర్తనా... వ్యక్తిత్వమే అతనిని ఉద్వేగపరిచాయి. ఆమె శరీరపు ఊహలు అతనికి కలగక పోలేదు. 'అవి సహజం. అవినీతికరం కాదు.' అనిపించాక వాటిని అతను అణగదొక్కనూలేదు. ఆ ఊహలను ఆమె ముందు ఉంచనూ లేదు. అయిదేళ్ల ఆ సాన్నిహిత్యం కనీస స్పర్శకు కూడా దారి తీయలేదు.

యిప్పుడు ఆ ఉత్తరం అందుకున్నాక అనేక ఊహలు కలిగాయి. కొన్నింటిని అతను అసహ్యించుకున్నాడు. పదివేలు యివ్వటంలో శరీర ప్రసక్తిని మనసు తీసుకువచ్చింది. తనమీద తనకు ఎంతో అగౌరవం కలిగింది. కాని- అది ఎంతోసేపు నిలవలేదు. "పదివేల విలువ చేసే వయసు ఆమె శరీరానికి లేదు. ఆ శరీరాన్ని తను స్వీకరించటం కూడా పదివేలతో బాటు అంతకుమించిన ఆనందాన్ని తనే ఆమెకు యివ్వటమే అవుతుంది. ఇది త్యాగం తన పాత ప్రేమకు గుర్తే! గౌరవమే" అంటూ మనసు క్రమంగా సర్దేసింది.

-ఇదంతా విడమరిచి తమ మధ్య సంబంధాన్ని ఆమెకు వ్యక్తం చేసే సాహసం కాని, ఉపాయంకాని మూర్తి దగ్గరలేవు. ఇప్పుడేదయినా సంబంధం ఏర్పడినా అది శాశ్వతంగా ఉండాలన్న కోరికకూడా అతగానికి లేదు.

మూర్తి తన తడబాటుని కనపడనీయకుండా నవ్వాడు--

"నువ్వే చెప్పు- పద్మా" అన్నాడు.

"నాకు తెలిస్తే గదా- నీకు చెప్పటానికి?"

"మన మధ్య కొత్త సంబంధం ఏర్పడుతుందంటావా--?"

"నీ సంగతి నాకు తెలియదు- నేను మాత్రం ఏర్పర్చుకుంటాను"

"ఏం సంబంధం?" అతని గొంతువణికింది. శరీరమంతా ఉద్విగ్నత. నాలిక

పొడారినట్లయింది.

"ఒక ఊహ యిచ్చే బాధను మరో ఊహతో తొలగించుకోవటం!-" పద్మ కళ్ళు మూసుకుంది.

ఆ నడివయసు స్త్రీ మూసుకొన్న కళ్ళ వెనక కదలాడుతున్న వేమిటో అతనికి అందటంలేదు. అవి తనకి ఆహ్వానాలా? ఏమో! ఎలా స్పందించాలి తను? భార్యతో వ్యవహరించడం తెలుసు. డబ్బు పెట్టి అమర్చుకునే స్త్రీలను తనేం ముద్దు చెయ్యనక్కర్లేదు. వాళ్ళే చేస్తారు. తనని నిలువరిస్తున్నదేమిటి? ఆమె గాంభీర్యత. ఒకప్పటిదయినా యిప్పటికీ సజీవంగా ఉన్న ఆమె సహవాసపుగుర్తు. తనెందుకు తొందరపడటం? యింతగా కదిలిపోతున్న పద్మ అక్కడ ఆగిపోదు. తనను అల్లుకుపోక మానదు. తనలో కరిగిపోకమానదు.

ఆ ఎక్స్‌పెక్టేషన్ ఆమెనొక అద్భుత సౌంతర్యరాశిగా అతనికి అనిపింపజేస్తోంది. అతనికి తన మనసులో భావాలు తెలియకూడదనీ ఉంది. ఆమె ఆహ్వానం తథ్యమనీ, దాన్ని తను మన్నించాలనీ అనుకుంటున్నాడు.

-డబ్బులు యిచ్చి ప్రతిఫలం ఆశించటం లోని నైచ్యం... డబ్బు ప్రసక్తిలేని ఆశలో లేదుగదా-! అనుకుంటున్నాడు.

"పద్మా-"

"చెప్పు-" కళ్ళుమూసుకునే అంది:

"నిన్ను డిస్టర్బ్ చేస్తానేమో!"

"నీకా హక్కుందిలే!-" కళ్ళు తెరిచి మృదువుగా నవ్వింది.

"నేను వెళ్ళిపోవాలి మరి-" అన్నాడు మూర్తి.

"అదేంటీ- ఈరోజుకి ఉండగూడదూ-?" ఆ గొంతూ, చూపూ ఎన్నో చెపుతున్నట్లే ఉన్నాయి అతనికి.

"నువ్వు బలవంతంగా ఉంచేస్తే ఉంటానుగానీ- పనులున్నాయి పద్మా"

"నువ్వు అప్పటికీ యిప్పటికీ ఏం మారలేదు మూర్తీ! ఈ నసుగుడు ఎందుకూ? ఎవరికి పనులుండవు! నిజమే! యీ వర్తమాన సమాజంలో మానవుడి ప్రధాన సమస్య- సమయం! ఒకడికి గడపటమయితే... యింకొకరికి పంచటం! నువ్వెంత సేపుంటే నాకు తృప్తి కలుగుతుంది! సరే! వెళ్ళు! ఈసారి మాత్రం తీరికగా రా! మీ ఆవిడనీ పిల్లలనీ కూడా తీసుకురా! మా వాళ్ళకు పరిచయం చేస్తాను-"

మూర్తి తెల్లబోయాడు. మనసంతా అసంతృప్తి. పరిస్థితిని గ్రహించగలిగికూడా... సరిగ్గా నిర్వహించలేకపోయానన్న విలవిల.

"వస్తాను పద్మా-" బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు.

"అదేంటీ- డబ్బేదీ?" అంది.

మూర్తి తల అటూ యిటూ ఊపుతూ నవ్వాడు- చూసావా! మరిచేపోయాను-" అంటూ వెనక్కి తిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"చెక్కా- యివ్వనా" అంటూ మూత తెరిచాడు సంశయాత్మకంగా!

"నీకీ ఊళ్ళో అకౌంట్ ఉందా-?"

"లేదు- కాష్... అయిదే ఉంది. ప్రయాణంలో కొంత ఖర్చయిపోయింది" అన్నాడు మూత పూర్తిగా తెరవకుండా జాగ్రత్తపడుతూ!

"ఫరవాలేదులే-" అంది ఆ కట్టతీసుకుంటూ!

"ఎప్పుడిస్తావ్-" అన్న ప్రశ్నను నొక్కిపెట్టి బ్రీఫ్ మూసాడు.

ఆమె నమ్మకం నుంచీ... ఆ భవనం నుంచీ ... ఆ గేటు నుంచీ... ఆ ఊరునుంచి ఎవరో తరుముతున్నట్లు బయటపడ్డాడు మూర్తి.

అయిదువేలు నష్టపోయినట్లో, మిగుల్చుకున్నట్లో; అయిదువేలకి మించిన దేన్నో పొందినట్లో, పోగొట్టుకున్నట్లో లెక్కలు తేల్చని మనసుతో మూర్తి తిరుగు ప్రయాణం సాగుతుంది.

అక్టోబర్ సంచికలో 'మార్క్ ట్వెయిన్' వ్యాసంలో నవల పేరు 'హకల్‌బెరీఫిన్' కి బదులుగా '[illegible]కర్ బెరీఫిన్' గా పొరపాటు దొర్లినట్లు గమనించగలరు.

— ఎడిటర్.

